క్లుప్తంగా

కౌటాలలో భారీ వర్షం

కౌటాల: మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. జూన్ మొదటి వారంలోనే పత్తి విత్తనాలు వేసి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. గురువారం వర్షం కురవడంతో పత్తి విత్తనాలు మొలకెత్తుతాయని ఆనందం వ్యక్తం చేశారు. వర్షం కారణంగా గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

జవాన్‌కు ఘన నివాళి

తాంసి: భారత సైన్యంలో విధులు నిర్వర్తిస్తూ.. మృతి చెందిన వీర జవాన్ దాసరి నవీన్ మూడో వర్ధంతిని పొన్నారి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని జవాన్ నవీన్ విగ్రహం వద్ద ప్రాణదాత ఫౌండేషన్ వ్యవస్థాపకులు రమేశ్ పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. నవీన్ తల్లిదండ్రులు దాసరి స్వామి, మిత్రులు దినేష్, కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాయితీ బస్‌పాసులు


మాట్లాడుతున్న ఎంపీడీవో అల్బర్ట్

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతువేదికలో జులై 5వ తేదీన దివ్యాంగులకు రాయితీ బస్సు పాసుల మేళా నిర్వహిస్తున్నట్లు పెంచికల్‌పేట్ ఎంపీడీవో అల్బర్ట్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్టీసీ అధికారుల కలిసి మాట్లాడారు. మండలంలోని దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, రెండు పాసుఫొటోలతో శిబిరానికి హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఎంపీవో గంగాసింగ్, ఆర్టీసీ అధికారులు దుర్గం తులసిరాం, జాడె పెంటు, ఇప్ప రవి, శంకర్ పాల్గొన్నారు.

రికార్డులు నమోదు చేయాలి


రికార్డులను పరిశీలిస్తున్న బలిరాం

కెరమెరి: రికార్డులు సక్రమంగా నమోదు చేయాలని అనార్‌పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బలిరాం అన్నారు. గురువారం మండలంలోని అనార్‌పల్లి గిరిజన ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. సమయ పాలన పాటించాలని, ఆంగ్లం, తెలుగు పదాలను గుర్తించే విధంగా విద్యార్థులను సన్నద్ధం కావాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


కాపువాడలో పర్యటిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని కాపువాడలో డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఉదయం పట్టణంలోని కాపువాడలో మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో కలిసి పర్యటించారు. సమస్యలను కాలనీవాసులు వారి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎమ్మాజీ సంతోష్, షైసెల్‌బిన్ సల్మాన్ పిర్సింగుల కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

నూతన స్తంభం ఏర్పాటు



స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కెరమెరి: మండలంలోని సుల్తాన్‌గూడలో విద్యుత్‌స్తంభంలో ఈనెల 24న సాక్షి దినపత్రికలో 'ప్రమాదకరంగా స్తంభం' అనే వార్త ప్రచురితం కావడంతో విద్యుత్ అధికారులు స్పందించారు. గురువారం కూలేందుకు సిద్ధంగా ఉన్న స్తంభాన్ని తొలగించి నూతన స్తంభం ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాదం తప్పిందని హర్షం వ్యక్తం చేశారు.

గాలొస్తే కరెంట్ కట్

- 156 గ్రామాలకు ఒకటే సబ్‌స్టేషన్
- నానాటికీ పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- కోతలతో ప్రజల ఉక్కిరిబిక్కిరి


కెస్లాగూడలో కర్రలే స్తంభాలు


కెరమెరిలోని విద్యుత్ సబ్‌స్టేషన్

కెరమెరి: తీగ తడిచిన.. చిరుగాలి వీచినా.. చినుకులు కురిసినా కరెంట్ కట్ అవుతోంది. రాత్రిపగలు, అనే తేడా లేకుండా ఎడాపెడా విద్యుత్ కోతలుండడంతో ప్రజలు విసుగు చెందుతున్నారు. కెరమెరి మండలంలో మొత్తం 156 గ్రామాలు ఉన్నాయి. అందులో గృహ వినియోగానికి సంబంధించిన విద్యుత్ మీటర్లు సుమారు 6 వేలకు పైగా ఉండగా వ్యవసాయ మీటర్లు 600 ఉన్నాయి. వీటిన్నింటికి ఒకే 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంది. దీంతో ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చినా.. అన్నిగ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఫలితంగా వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. వీటన్నింటికి కలిపి 5 ఫీడర్లు ఉన్నాయి. ఏ ఫీడర్‌లో అంతరాయం ఏర్పడిన అందరికి ఇబ్బంది వస్తుంది.

30 ఏళ్ల క్రితం సబ్‌స్టేషన్ నిర్మాణం..

సుమారు 30 ఏళ్ల క్రితం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టారు. అప్పుడు 2200 వరకు గృహాలకు సంబంధించిన విద్యుత్ మీటర్లు ఉండగా.. 20 వ్యవసాయ మీటర్లు ఉండేవి. అప్పటికి నుంచి ఇప్పటికి విద్యుత్ వినియోగం పెరిగింది. కానీ విద్యుత్ సబ్‌స్టేషన్ మాత్రం పెరగలేదు. దీంతో ఒకే దానిపై ఎక్కువ లోడు పడడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది.

12 రోజులు.. 174 సార్లు కరెంట్ కట్!

మండలంలోని 12 రోజుల్లో 174 సార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. అంటే ఎన్నిసార్లు కరెంటు పోతుందో. వస్తుందో ఇట్టే తెలుస్తుంది. ట్రిప్, ఎల్‌సీ, ఇన్ కమింగ్‌ల వల్ల అంతరాయం ఏర్పడింది. దీనికి కారణం పురాతన లైన్లు, స్తంభాలు, నూతనంగా ఇన్సులేటర్లు అమర్చుతున్నప్పటికీ నాణ్యతగా ఉండడం లేదని తరుచు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కాగా విద్యుత్ లైన్లు కూడా అత్యంత దూరంగా ఉండడం సరిపడా సిబ్బంది లేకపోవడం కూడా మరో కారణం. జోడేఘాట్, పరందోలి, అంతాపూర్, శంకర్‌లొద్ది లాంటి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సరి చేసేందుకు కనీసం 24 గంటలు పడుతుంది.

ఎప్పుడు పోతుందో తెలియడం లేదు



గతంలో విద్యుత్ సరఫరాలో ఇంత ఇబ్బంది ఉండేదికాదు. కానీ ఇటీవల కొద్ది రోజులుగా కరెంటు ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. వ్యవసాయానికి కూడా తిప్పలు తప్పడం లేదు. దోమలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలి.

– దండుగుల ఎల్లప్ప, కెరమెరి

ఇబ్బంది లేకుండా చూస్తాం

ఇటీవల కాలంలో తరుచుగా గాలి దుమారాలు వస్తున్నాయి. అందుకోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మండలం వైశాల్యంతో పాటు విస్తీర్ణం అధికంగా ఉన్నాయి. 33 కేవీలో జాప్యం లేకుండా చూస్తాం. సబ్‌స్టేషన్ ఒక్కటే ఉండడంతో ఇబ్బంది తప్పడం లేదు.

– వాసుదేవ్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ

రగులుతున్న 'పోడు' చిచ్చు

- స్వచ్ఛందంగా పోడు భూములు వదులుకోవాలంటున్న అధికారులు
- ఆందోళనలో రైతులు

బెజ్జూర్: అన్నదాతలు, అటవీశాఖ అధికారుల మధ్య పోడు చిచ్చు నెలకొంది. మండల కేంద్రంతో పాటు ఏటిగూడ, సిద్దాపూర్, పాపన్నపేట, గబ్బాయి గ్రామాలకు చెందిన రైతులు గత 50 ఏళ్ల నుంచి పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈభూములపై పోడు రైతులకు, అటవీశాఖ అధికారులకు మధ్య చిచ్చు రగులుతూ ఉంది. అయితే గతంలో పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు హక్కు పత్రాలు కల్పించగా, బీసీ, ఎస్సీ రైతులు కూడా చాలా మంది పోడు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం కొనసాగించేవారు ఉన్నారు. అయితే పట్టా భూములు లేక చాలా మంది రైతులు పోడు వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతుండగా, కూలీలు సైతం చాలా వరకు ఉన్నారు. అయితే వర్షాకాలం ప్రారంభం కావడం, ఈ పోడు భూముల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తుకోగా, మొలకలు సైతం వచ్చాయి. ఇప్పటికే ఒక్కొక్క రైతు దాదాపుగా పోడు భూముల్లో లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టారు. తీరా అధికారులు ఆ భూముల్లో మొక్కలు నాటొద్దు.. స్వచ్ఛందంగా భూములు వదులుకోవాలని అంటూ హుకుం జారీ చేస్తున్నారు.

50 ఏళ్ల నుంచి కాస్తు..

గత 40 ఏళ్లగా పోడు భూములపై జీవనాధారం కొనసాగిస్తున్న రైతులకు ఒకేసారి అధికారులు భూములు తిరిగి స్వాధీనం చేసుకుంటాం, పంటలు వేసుకోవద్దు, పోడు భూములు వదులుకోవాలని తేల్చి చెప్పడంతో రైతులు ఎవరికి చెప్పాలో అర్థం కాక లబోదిబోమంటున్నారు. వందలాది మంది రైతులు పోడు భూములపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. అటవీ అధికారులు భూములను స్వాధీనం చేసుకుంటే తమ పరిస్థితి ఎంటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు మీద పడుతాం



గత 50 ఏళ్ల క్రితం నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా. ఈ భూములు తీసుకుంటే మా బతుకు రోడ్ల మీదకి వస్తాయి. ఇది తప్పితే ఎక్కడ కూడా భూమి లేదు. ఇదే జీవన ఆధారం. మా భూములు తీసుకోవద్దు.

– భీమయ్య, రైతు, పాపన్‌పేట

పోడు భూమే ఆధారం



పోడు భూమే మాకు ఆధారం. దీన్నే నమ్ముకొని గత కొన్ని సంవత్సరాలుగా జీవనాన్ని కొనసాగిస్తున్నాం. కుటుంబం మొత్తం పోడు భూమిపైనే ఆధారపడి ఉంది. అధికారులు స్పందించి మాలాంటి నిరుపేదలకు న్యాయం చేయాలి.

– కొత్రంగి మొండి, రైతు, సిద్దపూర్

కవాతు విజయవంతం చేయాలి

ఎదులాపురం: వరంగల్ జిల్లా కేంద్రంలో జూలై 7న నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రింట్‌మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ దండోరా ఉద్యమం ఆవిర్భవించి జూలై 7వ తేదీతో 30 ఏళ్లు పూర్తవుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే ఆత్మగౌరవ కవాతు నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని గ్రామాల్లో ఈనెల 5న జెండా ఆవిష్కరణ చేయాలన్నారు. నాయకులు కూడల స్వామి, బాలాజీ, రాంప్రసాద్, రవి అశోక్, రాజు, పరశురాం, దీపక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లేశ్ మాదిగ

స్వచ్ఛందంగా భూములు అప్పగించండి


రైతులతో మాట్లాడుతున్న రేంజ్ అధికారి

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు పాపన్నపేట గ్రామంలో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులు స్వచ్ఛందంగా ఆ భూములను అప్పగించాలని బెజ్జూర్ రేంజ్ అధికారి దయాకర్ అన్నారు. అడవులు అంతరించి పోవడంతో సకాలంలో వర్షాలు కురువలేక పోతున్నాయని, రానున్న రోజుల్లో ఎండ తీవ్రతకు మనిషి అనారోగ్య కారణంతో పాటు తదితర సమస్యలతో ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు ముందుకు రావా లని కోరారు. అధికారులతో ఎలాంటి తగాదాలు లేకుండా రైతులు నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

వారసంత వేలం


వేలంలో పాల్గొన్న సభ్యులు, ఎంపీపీ, ఎంపీడీవో

కెరమెరి: మండల కేంద్రంలోని కెరమెరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం వారసంత వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఐదుగురు పాల్గొనగా రాథోడ్ సాగర్ రూ.1,87,500 దక్కించుకున్నారు. ప్రభుత్వ డిమాండ్ రూ. 1.86 లక్షలు ఉంది. వచ్చే నెల నుంచి తొమ్మిది మాసాల వరకు వేలం కొనసాగుతుందని గ్రా మకార్యదర్శి భీమయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం, ఎంపీడీవో ఎండీ అంజద్ పాషా, కారోబారి వెంకన్న, తది తరులు పాల్గొన్నారు.

పశువుల వారసంత వేలం వాయిదా

సిర్పూర్(టి): మండలంలోని హుడ్కిలి గ్రామపంచాయతీ పరిధిలో ప్రతీ వారం నిర్వహించే పశువుల వారసంత వేలంను వాయిదా వేస్తున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి హరీష్ ప్రకటించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించగా గ్రామపంచాయతీ నిర్ణయించిన ధర కన్న తక్కువగా పాడడంతో వేలం వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. వేలం పాటను తిరిగి ఈనెల 29న స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు.

నాణ్యమైన విద్య అందించాలి


మాట్లాడుతున్న అధికారులు

కౌటాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు జాతీయ నూతన విద్యా విధానంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన విద్యాచట్టానికి అనుగుణంగా ప్రాథమిక దశలోనే చిన్నారులకు మెరుగైన విద్యా అందించాలనే లక్ష్యంతో అంగన్వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లగా మారుస్తుందన్నారు. బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు షకీరా బేగం, కరుణ, పద్మ, శంకరమ్మ, హసినా బేగం, టీచర్లు పాల్గొన్నారు.

కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి


సమస్యలు తెలుసుకుంటున్న తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): సీహెచ్‌పీలో పని చేస్తున్న కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి అన్నారు. గురువారం గోలేటి సీహెచ్‌పీని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీహెచ్‌పీలో అమలు చేస్తున్న బెల్ట్‌సేఫ్టీ సిస్టం, డస్ట్ సపరేట్ మానిటరింగ్‌ను పరిశీలించారు. అనంతరం సీహెచ్‌పీ డీజీఎం భీంరావు జాడేతో కార్మికుల సమస్యలపై చర్చించారు. ఫిట్ కార్యదర్శి ఎంబడి రామయ్య, గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేష శయనరావు, ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


తనిఖీ చేస్తున్న సీఐ సతీశ్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద గురువారం సీఐ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. నంబర్ ప్లేట్, డ్రైవింగ్ లైసెన్స్, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలతోపాటు బైక్‌లు నడుపుతున్న మైనర్లను గుర్తించి జరినామా విధించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సైలు రాజేశ్వర్, ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సంత వేలానికి వేళాయె

- కాసుల పంట కురిసేనా?
- నేడు కౌటాల వారసంత వేలం
- ఏటా రూ. లక్షల్లో ఆదాయం


కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు

కౌటాల: పేద, మధ్యతరగతి కుటుంబాల అవసరాలకు వారానికోసారి సరిపడా సరుకులు, కూరగాయాలను కొనుగోలు చేసేందుకు సంతలపై ఆధారపడుతుంటారు. పల్లెలు, మండల కేంద్రాల్లో నిర్వహించే సంతలకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది. అన్ని రకాల నిత్యవసరాలు దొరికే సామాన్యుడి మినీ మార్కెట్‌గా చెప్పుకోవచ్చు. పంచాయతీలకు ఆదాయ వనరులుగా నిలుస్తున్న వారసంతల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో సంబంధిత యంత్రాంగం విఫలమవుతోంది. చాలా చోట్ల ప్రత్యేక స్థలాలు, షెడ్లు లేక రోడ్లకు ఇరువైపులా తాత్కాలిక డేరాలు వేసుకొని దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక అవస్థలు పడుతున్నారు. స్థలం లేక రోడ్లకు ఇరువైపులా దుకా ణాలు ఏర్పాటు చేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

లక్షల్లో ఆదాయం..

కౌటాల మండల కేంద్రంలో ప్రతీ సోమవారం వారసంత నిర్వహిస్తారు. ఈ సంతలో ప్రజలకు కూరగాయలతో పాటు నిత్యవసర సరుకులు, బట్టలు, స్టీల్ వస్తువులు, ఎద్దుల అలంకరణ వస్తువులు దొరుకుతాయి. సంతలో రూ. లక్షల్లో వ్యాపారం కొనసాగుతుంది. కౌటాల వారసంతలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే అతిపెద్ద వారసంతగా పేరుంది. సోమవారం వారసంతతో పాటు పశువుల సంతను కౌటాలలో నిర్వహిస్తారు. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి), కాగజ్‌నగర్ మండలాలతో పాటు మహారాష్ట్ర ప్రాంతం నుంచి వ్యాపారులు, వినియోగదారులు వేల సంఖ్యలో వస్తారు. వారసంత స్థలం కబ్జాకు గురవుతుండడంతో స్థలం సరిపోక వ్యాపారులు కౌటాల– బెజ్జూర్ ప్రధాన రహదారికి ఇరువైపులా విక్రయాలు చేస్తున్నారు. పంచాయతీకి రూ. లక్షల్లో అదనపు ఆదాయం వస్తుంది. కౌటాల వారసంతతో సుమారు రూ. 7 లక్షల వరకు ఆదాయం వస్తుండగా.. పశువుల సంతతో సుమారు రూ. 12 లక్షల పైనే ఆదాయం వస్తోంది.

కనీస సౌకర్యాలు కరువు..

వారసంత స్థలాలు కబ్జాకు గురవుతుండడంతో వ్యాపారులకు స్థలం సరిపోవడం లేదు. దీంతో వ్యాపారులు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా విక్రయాలు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. సులభ్ కాంప్లెక్స్‌లు లేకపోవడంతో అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. మూగజీవాలు సైతం ఎండలో ఎండుతూ.. వానలో తడుస్తున్నాయి. వారసంతల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యాపారులు, వినియోదారులు కోరుతున్నారు.

నేడు వేలం..

కౌటాల మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పశువుల సంత, వారసంత వేలం నిర్వహించనున్నారు. ఈ వేలంలో పాల్గొనే వారు వారసంతకు రూ. 75 వేలు, పశువుల సంతకు రూ. 1.50 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఆసక్తి గల ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సకాలంలో హాజరు కావాలని అధికారులు కోరుతున్నారు.

గ్రామస్తులు కాపాడిన చుక్కల దుప్పి మృతి

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని సారసాల గ్రామస్తులు కుక్కల దాడి నుంచి కాపాడిన చుక్కల దుప్పి గురువారం మృతి చెందింది. ఈనెల 25న సారసాల గ్రామశివారులో చుక్కల దుప్పిని కుక్కలు దాడి చేసి తరుముతుండగా గమనించిన రైతులు కాపాడారు. అనంతరం వైద్యచికిత్సలు చేసిన అనంతరం అటవీశాఖ అధికారులు అటవీ ప్రాంతంలో వదిలివేశారు. అయితే చుక్కల దుప్పి సారసాల అటవీ ప్రాంతంలో మృతి చెందింది. తీగదారి దుప్పి కొమ్ములకు తగిలి ఇరుక్కుపోయి మృతి చెందిందని ఎఫ్‌ఆర్‌వో రమాదేవి తెలిపారు. పంచనామా నిర్వహించి ఖననం చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు నిర్మించాలి

బోథ్: మండలంలోని కైలాస్ టెకిడి ఆలయానికి రోడ్డు పనులను త్వరితగతిన చేపట్టాలని ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్ కోరా రు. గురువారం బోథ్‌కు వచ్చిన ఎమ్మెల్యే అ నిల్ జాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. జెడ్పీటీసీ సంధ్యారాణి, చైర్మన్ సోలంకి రుక్మన్‌సింగ్, చిలుకూరి నరేందర్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: విద్యార్థి సంఘ నాయకులపై సస్పెన్షన్‌ను నిరసిస్తూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయు) వైస్ చాన్స్‌లర్ దిష్టిబొమ్మను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గురువారం దహనం చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, సాయికృష్ణలు మాట్లాడుతూ యూనివర్సిటీలో సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులను సస్పెండ్ చేయడం దుర్మార్గమైన చర్య మండిపడ్డారు. విద్యార్థి సంఘ నాయకులపై వేసిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తుమిడె భీమేష్, సహాయ కార్యదర్శి సిరికొండ సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

దహెగాం: మండలంలోని పీకలగుండం గ్రా మానికి చెందిన దుర్గం పురుషోత్తం అనే రై తుకు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి గాలి వీయడంతో విద్యుత్ తీగ తెగి గేదే మీద పడడంతో అక్కడిక్కడే మృతి చెందింది.